తండ్రి మందలించాడని..

- గడ్డిమందు తాగిన యువతి
- చికిత్స పొందుతూ మృతి

సారంగాపూర్, జూన్ 9: తండ్రి మందలించాడని క్షణికావేశంలో ఓ యువతి గడ్డిమందు తాగగా, చికిత్సపొందుతూ దవాఖానలో మృతిచెందింది. ఈ విషాదకర ఘటన బీర్‌పూర్ మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేం ద్రానికి చెందిన అల్లెపు సుప్రియ(18) ఇంట్లో అక్కతో గొడవపడుతుండగా తండ్రి అశోక్ మందలించాడు. దీంతో క్షణికావేశంలో ఈ నెల 6న గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి దవాఖానకు తరలించగా చికిత్సపొం దు తూ ఆదివారం రాత్రి మృతి చెందింది. తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ రవీందర్ తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్, జూన్ 9: చిట్టాపూర్‌లోని పెద్ద చెరువు భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ రమేశ్‌గౌడ్‌కు గ్రామ గంగపుత్ర సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. తమకు జీవనాధారమైన చెరువును కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని చెరువు భూమిని కాపాడాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'రైతు మిత్ర'

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్
- రైతుమిత్ర కార్యక్రమం ప్రారంభం

జగిత్యాల టౌన్: రైతుమిత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారులు

జగిత్యాల టౌన్, జూన్ 9: రాష్ట్రంలోనే మొదటిసారిగా జిల్లాలో రైతుల వ్యవసాయ సమస్యలు తీర్చడానికి రైతుమిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన ఆయన మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులతో సమావేశమై ఎలాంటి విత్తనాలు వాడాలి, పంటల్లో చీడపీడలు, ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు ఏ విధంగా చేపట్టాలి, పంటల సాగు సమస్యలకు సమగ్ర పరిష్కారం రైతు మిత్ర కార్యక్రమం ద్వారా అందిస్తామన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పొలాస పరిశోధనా స్థానం సహాయ సంచాలకుడు జీ శ్రీనివాస్ ధర్మపురి, మెట్‌పల్లి కార్యాలయాల్లో రైతుమిత్ర కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదేవిధంగా ప్రతి సోమవారం ఇద్దరు నుంచి ముగ్గురు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశమవుతారన్నారు. రైతుల సమస్యల రికార్డు పుస్తకంలో నమోదు చేసి అవసరమైన చర్యలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ తిరుపతి, శాస్త్రవేత్తలు రజినీకాంత్, శ్రీనివాస్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

'రైతు మిత్ర'ను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి, జూన్ 9: రైతు మిత్ర కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి ఏడీఏ రమేశ్ సూచించారు. సోమవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో రైతుమిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటూ.. పంట యాజమాన్యంలో పాటించాల్సి మెలకువలు, చీడపీడల నివారణ, వానకాలంలో ఎంపిక విత్తనాల రకాలపై వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గోన్యానాయక్, స్వాతి, ఏవోలు దీపిక, లావణ్య, యోగిత, రాజ్‌కుమార్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రైతులు వినియోగించుకోవాలి

ధర్మపురి, జూన్ 9: రైతుమిత్ర-ఫార్మర్ ఫ్రెండ్ కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని ఏడీఏ రామ్‌చందర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు బలరాం, రవి, ఏవో రాజ్‌కుమార్, ఏఈవోలు సమత, అజయ్, నవ్య ఉన్నారు.

రామన్నపేటలో సిరిమల్ల రమ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

మల్యాల, జూన్ 9: అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భరోసానిచ్చారు. మల్యాల మండలం గొర్రెగుండంలో మాజీ సర్పంచ్ సుంకె లచ్చయ్య తండ్రి సుంకె పెద్దనచ్చయ్య, రామన్నపేటలో రాంపల్లి మల్లయ్య, సిరమల్ల రమ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కొండపలుకుల రామ్మోహన్‌రావు, గడ్డం మల్లారెడ్డి, అజహరొద్దీన్, రియాజ్, అన్నపు తిరుపతి, జున్న సురేశ్, వరుణ్‌రావు, జంబిరాజు, మనోజ్, చాప మహేశ్, రాజేందర్ ఉన్నారు.

బొమ్మెనలో ఇంటిపై పిడుగు

కథలాపూర్, జూన్ 9: బొమ్మెన లో గడ్డం చిన్నారెడ్డి ఇంటిపై సోమవారం ఉదయం పిడుగుపడింది. దీంతో భవనం పైభాగం కొద్దిగా పగుళ్లు చూపింది. లింగారెడ్డి ఇంటిలోని ఎలక్ట్రికల్ వస్తువులు, అతడి పక్కింటి వారి ఇంట్లో రెండు ఫ్యాన్లు కాలిపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరుగకపోవడంతో గ్రామస్తులంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఎమ్మెల్యే గోపీనాథ్ మృతి బాధాకరం

గోపీనాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, జూన్ 9: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బాధాకరమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం గోపీనాథ్ చిత్రపటానికి ఆయన నివాసంలో పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్‌అలీ తదితరులు ఉన్నారు.

'రోళ్లవాగు'కు అనుమతులు మంజూరు చేయాలి

రోళ్లవాగు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ సోమవారం ప్రిన్సిపాల్ చీఫ్ కన్సర్వేటిక్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) సువర్ణను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర అటవీ పర్యావరణశాఖ మంత్రితో మాట్లాడి అనుమతులు ఇవ్వడానికి చొరవ తీసుకోవాలన్నారు.

తడి, పొడి చెత్తను వేరుగా చేసి ఇవ్వాలి

అధికారులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి టౌన్, జూన్ 9: పట్టణ ప్రజలు తమ ఇండ్లల్లోని తడి, పొడి చెత్తను వేరుగా మున్సిపల్ వాహనాలకు అందజేయాలని కమిషనర్ మోహన్ సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు వార్డులో సేకరిస్తున్న చెత్తను పరిశీలించి, మాట్లాడారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 120మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వాడకం నిషేదంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ మారు విష్ణు వర్ధన్‌రెడ్డి, ముజీబ్, నిజాం, అశోక్, నరేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాలు.. బాటసారుల అవస్థలు

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

మారుతీనగర్, జూన్ 9: మెట్‌పల్లిలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ వ్యవస్థ అస్థవ్యస్థంగా మరుతోంది. ఫ్లైఓవర్ మూలమలుపుల వద్ద కార్లు, ఆటోలు పార్కింగ్ చేయడం, తినుబండారులు ఉండడంతో బాటసార్లు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ముంబాయి వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్‌ల వద్ద మధ్యాహ్నం బస్సులను రోడ్డుపైనే నిలుపడంతో ప్రయాణికుల కార్లు, ఆటోలు రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.ఇతర వాహనదారులు ఇబ్బందిప డుతున్నా ట్రాఫిక్‌పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు ఉన్నాయి.

వంద రోజుల ప్రణాళిక సక్సెస్ చేయాలి

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 9: కరీంనగర్ నగరపాలక సంస్థలో 100 రోజుల ప్రణాళికను విజయవంతంగా పూర్తి చేయాలని సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం వంద రోజుల ప్రణాళికను పరిశీలించేందుకు స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ నగరంలో పర్యటించారు. స్థానిక పద్మనగర్ ప్రాంతంలో ఇటీవల మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో ప్లాంటేషన్ చేసిన ప్రకృతి వనాన్ని సందర్శించారు. అనంతరం సప్తగిరి కాలనీలో గల పార్కును పరిశీలించారు. పార్కులో గ్రీనరీని పెంచాలని అధికారులకు సూచించారు. హౌజింగ్ బోర్డు రిసోర్స్ పార్కుతో పాటు ఎస్ఆర్ఆర్ సమీపంలోని రిజర్వాయర్‌ను సందర్శించారు. డీఆర్‌సీసీ సెంటర్లను తనిఖీ చేశారు. టవర్‌సర్కిల్, మార్కెట్ ఏరియాలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ వెండర్స్ మేళాలో పాల్గొన్నారు. అనంతరం కార్యాలయంలో రెవెన్యూ, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. షెడ్యుల్ ప్రకారం వంద రోజుల కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని పరిశుభ్రం చేస్తూ పచ్చదనం పెంచాలన్నారు. నగరంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉన్నా మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. నగరంలో నల్లాలు లేని నివాస గృహాలకు నల్లా కనెక్షన్లు ఇవ్వాలని, వాటిని వెంటవెంటనే అన్‌లైన్ చేయాలని ఆదేశించారు. అన్ని వ్యాపార దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మోహియొద్దీన్, డీఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అమ్మమాట-అంగన్‌వాడీ బాట

జగిత్యాల రూరల్, జూన్ 9: జిల్లాలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10నుంచి 17 వరకు అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించగా. కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ నెల 10నుంచి 17వరకు అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లుల భాగస్వామ్యాన్ని మెరుగుపర్చడం, ప్రీస్కూల్ విద్యను బలోపేతం చేయడం, పిల్లల మెరుగైన ఆరోగ్యం కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మెట్‌పల్లి, జూన్ 9: పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన ఒర్సు అక్షయ్‌కుమార్ ఈ నెల 6న ఇంటికి తాళం వేసి స్వగ్రామం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు వెళ్లాడు. తిరిగి ఈ నెల 9న ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉన్నది. బీరువాలో వస్తువులు చిందరవందరంగా పడిఉన్నాయి. తులంన్నర బంగారు నగలు, 15 తులాల వెండి నగలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT METPALLY
O.S.NO. 5 OF 2024

Between:
Kacharla Srinivas ....Plaintiff
AND
1. Brammadevula Manasa Ramana
2. Nunugonda Ravi Kumar
...Defendants

To,
1. Brammadevula Manasa Ramana, S/o. Sudarshan, Age: 34 yrs, Occ: Business, R/o. H.No: 6-13, Maruthi Nagar, Choulamaddi, Metpally mandal, Jagtial dist.
Whereas the above named Plaintiff have filed the above Sult seeking the relief of Specific Performance of Agreement of Sale. That the sult summons were sent to you is un-served and returned. You are hereby summoned to appear before the above said Court in person or by an Advocate **on 17-07-2025** at 10.30 a.m. to answer all material questions relating to the above suit.Take notice that you the Defendant No.1 named above should appear either in person or through your counsel on 17-07-2025 before the above said Hon'ble Senior Civil Judge Court at Metpally, at 10-30 a.m. failing which the matter will be decided as per law.
//BY THE ORDER OF THE COURT//
Sd/- **VADDAEPALLY SHREENIVASAN BHIMANATHI RAGHU**
Advocates for the Plaintiff, Korutla.

పాతకక్షలతోనే కొట్టిచంపిన్రు

- రమణారెడ్డి హత్యలో ఎనిమిది మంది నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

హత్య కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

మల్యాల, జూన్ 9: పాతకక్షలతోనే ఈ నెల 2న కొండగట్టులో ఓ యువకుడిని కొట్టి చంపారని, ఈ కేసులో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పేర్కొన్నారు. దృష్యం సినిమా తరహాలో జరిగిన ఈ హత్య కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో సీఐ నీలం రవితో కలిసి ఆయన వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కొండగట్టుకు చెందిన ఉప్పు రమణారెడ్డి (30), బండి సిద్ధు అలియాస్ సిద్ధార్థ్ మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 5న సిద్ధార్థ్ పెండ్లి నిశ్చయం కాగా, ఈ నెల 2న హల్దీ వేడుక నిర్వహించారు. ఈ క్రమంలో రమణారెడ్డి సిద్ధార్థ్ ఇంటికెళ్లి సిద్ధార్థ్‌తోపాటు అతడి స్నేహితులను చంపేస్తానని బెదిరించాడు. ప్రతి విషయంలో ఆధిపత్యం కోసం రమణారెడ్డి అడ్డుపడుతున్నాడని, ఎలాగైనా అతడిని చంపాలని సిద్ధార్థ్, అతడి స్నేహితులు చింతలకోటి వినయ్, పస్తం ఈశ్వర్ నిశ్చయించుకున్నారు. అదేరోజు (ఈ నెల 2న) రాత్రి 10గంటల సమయంలో సిద్ధార్థ్, వినయ్ కొండగట్టు దిగువన గల బస్టాండ్ వద్ద ఉండగా, అదే సమయంలో రమణారెడ్డి అక్కడికి చేరుకుని వారితో గొడవపడ్డాడు. ఈ క్రమంలోనే అక్కడికి చేరుకున్న పస్తం ఈశ్వర్, అతడి స్నేహితులు రమణారెడ్డిని వారి బైక్‌పై బలవంతంగా కొండపైకి వెళ్లే మెట్లదారి పక్కన గల నిర్మాణుష్య ప్రాంతానికి తీసుకెళ్లి.. తీవ్రంగా కొట్టి బండరాళ్లు మీద వేసి చంపారు. మృతదేహం అక్కడే ఉంటే అనుమానం వస్తుందని భావించిన సిద్ధార్థ్, ఈశ్వర్.. వెంటనే వారి స్నేహితులైన దాసరి ఆకాశ్, మంచినీళ్ల అజయ్, పంజాల మధుతోపాటు మరో ఇద్దరు మైనర్లతో కలిసి మెట్లదారి సమీపంలో గల ఉపాధిహామీ గుంతల వద్దకు మృతదేహాన్ని ఈడ్చుకెళ్లి పూడ్చిపెట్టారు. ఆ తదుపరి హత్యలో బండి సిద్ధార్థ్ ఈ నెల 5న పెండ్లి చేసుకున్నాడు. రమణారెడ్డి ఐదు రోజులుగా కనిపించకపోవడంతో అతడి సోదరుడు నిరంజన్ రెడ్డి స్థానికులను వాకబు చేయగా, కొంత మంది యువకులతో మీ తమ్ముడికి గొడవ జరిగిందని తెలుసుకున్నాడు. వెంటనే ఈ నెల 7న మల్యాల పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. సీఐ నీలం రవి, ఎస్ఐ నరేశ్‌కుమార్ నేతృత్వంలో సాంకేతిక పరిజ్ఞానంతో ఆధారాలు సేకరించడంతోపాటు పలువురు యువకులను విచారించగా రమణారెడ్డిని కొట్టి చంపినట్లు పస్తం ఈశ్వర్ నేరం ఒప్పుకొన్నాడు. ఈ క్రమంలో పాతిపెట్టిన శవాన్ని తహసీల్దార్, వైద్య బృందం నేతృత్వంలో వెలికితీయగా.. రమణారెడ్డిదిగా కుటుంబసభ్యులు ధ్రువీకరించారు. కాగా, రమణారెడ్డిపై పలు పోలీస్ స్టేషన్లలో ఇప్పటి వరకు 27కేసులు ఉన్నాయి. హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కొండగట్టుకు చెందిన బండి సిద్ధార్థ్, పస్తం ఈశ్వర్, దాసరి ఆకాష్, మంచినీళ్ల అజయ్, పంజాల మధు, వేములవాడ మండలం మర్రిపల్లికి చెందిన చింతలకోటి వినయ్‌తో పాటు ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ద్విచక్రవాహనం, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి ఎస్ఐలు నరేశ్‌కుమార్, సౌడం సందీప్, రవీందర్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి చేయాలి

జగిత్యాల, జూన్ 9: రాబోయే నవంబర్ నాటికి జిల్లాలో చేపట్టిన నూతన ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎస్ కే రామకృష్ణారావుతో కలిసి బడిబాట, ఇందిరా మహిళాశక్తి కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళా శక్తి భవనాలకు సీఎం చేతులమీదుగా గత నవంబర్‌లో శంకుస్థాపన చేశామని, పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీర్లను సమన్వయం చేసుకుంటూ నిర్దేశించుకున్న గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 12న పాఠశాలలో పునః ప్రారంభోత్సవం సందర్భంగా పండుగ వాతావరణంలో పిల్లలకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రం చేయాలని, పిచ్చి మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో పూర్తి స్థాయిలో నూతన మహిళా సంఘాలను తయారు చేసి మహిళలను గ్రూపులలో జాయిన్ చేయాలన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ గాంధీ జయంతి నాటికి పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బీ సత్య ప్రసాద్, డీఆర్‌డీవో రఘువరన్, డీఈవో రామ్, ఆయాశాఖల అధికారులు, కోరుట్ల ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, కథలాపూర్ తహసీల్దార్ వినోద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

చేసిన పనుల బిల్లులను మంజూరు చేయాలి

మల్లాపూర్, జూన్ 9: మన ఊరు-మన బడి పథకంలో భాగంగా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల భవన నిర్మాణాలు, తదితర పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయాలని మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం మాజీ ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లతో కలిసి స్థానిక తహసీల్దార్ రమేశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు బిల్లును మంజూరు చేసి ఆదుకోవాలని, లేకుంటే కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలలకు తాళాలు వేసి నిరాహార దీక్షలు చేపడుతామన్నారు. ఇక్కడ ఏఎంసీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, మాజీ సర్పంచులు రంగు రామాగౌడ్, వనతడపుల నాగరాజ్, అలిశెట్టి రవి, సయ్యద్ హైదర్, కాంట్రాక్టర్లు నర్సింగరావు, బిట్ల నరేశ్, మోహన్, గంగారెడ్డి ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం

జగిత్యాల, జూన్ 9: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ నిరంతర పోరాటం చేస్తున్నదని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక విద్యానగర్‌లోని ఎస్టీయూ భవన్‌లో పతాకాన్ని ఆవిష్కరించి, 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. నిజాం హయాంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మగ్దూం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో 1947 జూన్ 9న స్టేట్ టీచర్స్ యూనియన్ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి నిరంతరం ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతూ మొదటగా పీఆర్సీ, డీఏ, పెన్షన్‌లను సాధించి పెట్టిన ఘనత ఎస్టీయూకే దక్కుతుందన్నారు. రాష్ట్ర కార్యదర్శులు సీర్నాంచ రవీందర్, పాలెపు శివరామకృష్ణ మాట్లాడుతూ, 2003 డీఎస్సీలో ఎంపికైన వారికి పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, పెండింగ్ డీఏలను మంజూరు చేసి, వెంటనే పీఆర్సీ ప్రకటించాలన్నారు. ఈ సందర్భంగా మగ్దూం మొయినుద్దీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత ఎస్టీయూ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ హెచ్ఎం కన్నోజు ఈశ్వరయ్యను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాస్, మేకల ప్రవీణ్, సిరిపురం రాజేశ్, ఊరడి ప్రభాకర్, ఏగ్యారపు వెంకటేశ్, గుండెల నరేశ్, విద్యామణి కృష్ణ, గుర్రం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జెండాను ఎగురవేస్తున్న సంఘం నాయకులు

సత్వర పరిష్కారం చూపాలి

- కలెక్టర్ సత్యప్రసాద్

కథలాపూర్, జూన్ 9: భూభారతి గ్రామ సభల ద్వారా వచ్చిన దరఖాస్తులను అధికారులు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. తాండ్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలను సోమవారం ఆయన పర్యవేక్షించారు. రైతులు ఇచ్చే దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, పహాణీలను పరిశీలించాలన్నారు. సమస్యలను పరిష్కరించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రెండు గ్రామాల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నగేశ్ పాల్గొన్నారు.

సారంగాపూర్, జూన్ 9: సారంగాపూర్, బీర్‌పూర్ మండలంలోని నాగునూర్, తుంగూర్ గ్రామాల్లో తహసీల్దార్లు వహీదొద్దీన్, సుజాత, డిప్యూటీ తహసీల్దార్ల టీం బృందం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇక్కడ డీటీ బొమ్మకంటి శ్రీనివాస్, ఆర్ఐలు వెంకటేశ్, శ్రీనివాస్, రాహుల్, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు ఉన్నారు.

కొడిమ్యాల, జూన్ 9: రామ్‌సాగర్‌లో నిర్వహించిన భూభారతి సభలో 91దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇక్కడ ఆర్ఐ కరుణాకర్ ఉన్నారు.

పహాణీలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, జూన్ 9: పైడి మడుగు, జోగిన్‌పల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇక్కడ కాంగ్రెస్ సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి, డీటీ పారుఖీ, ఆర్ఐలు రాజేందర్‌రావు, అమద్‌సమద్ ఉన్నారు.

రాయికల్, జూన్ 9: చింతలూరు, అల్లీపూర్ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు భూ భారతి గ్రామసభలు నిర్వహించారు. ఇక్కడ తహసీల్దార్ నాగార్జున, ఆర్ఐలు పద్మయ్య, దేవదాస్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మేడిపల్లి, జూన్9: కల్వకోటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 37మంది రైతుల నుంచి తహసీల్దార్ మునీందర్ అర్జీలు స్వీకరించారు. భీమారం మండలం ఓడ్డాడులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ రవికిరణ్ తెలిపారు. ఇక్కడ డీటీ ఆనంద్‌కుమార్, ఆర్ఐలు ప్రవీణ్, రమేశ్, రాజారాం, కిరణ్‌కుమార్ ఉన్నారు.

'భగీరథ' పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు

- 'నమస్తే' కథనానికి స్పందన

పెగడపల్లి, జూన్ 9: మండల కేంద్రం నుంచి నందగిరి, ఐతుపల్లి గ్రామాలకు వెళ్లే మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలకు సోమవారం అధికారులు మరమ్మతులు చేయించారు. సోమవారం నమస్తే తెలంగాణలో 'మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ' శీర